
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
ఆదివారం 16 ఫిబ్రవరి 2025



కాంట్రాక్ట్ పద్ధతిలో 2008 డీఎస్సీ అభ్యర్థుల నియామకాలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : 2008 డీఎస్సీ అభ్యర్థులకు సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా విద్యాధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం 50 మంది అభ్యర్థులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామక పత్రాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. వీరితో పాటు ఎస్‌వో నర్సింలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉషోదయపు కాంతి

మెలమెల్లగా తెలవారుతుంటే అప్పుడప్పుడే వస్తున్న సూర్యుడు బంగారు రంగులో దర్శనమిచ్చాడు. శనివారం ఉదయం కాస్త చలి ఉండటంతో మంచు ఆవిరితో మరింత రమణీయంగా సూర్యోదయం కనిపించింది. సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు నీటిలో భానుడి ప్రతిబింబం చూపరులను ఆకట్టుకుంది. ఉదయం వాకింగ్ వచ్చిన వారు ఈ సుందర దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు.

- సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి)

ఈ అంగడి సర్వ సామగ్రి దొరికే చోటు.. పేదోడి సూపర్ మార్ట్.. కష్టజీవి వారాంతంలో వచ్చి ఆనందంగా గడిపే వేదిక.. ఎక్కడెక్కడి నుంచో వచ్చే జనాలను కలుపుకునే అడ్డా.. చిరు వ్యాపారుల సమ్మేళనం.. సబ్బండ వర్గాలకు అవసరమైన విపణి.. నాటి వస్తువు మార్పిడి నుంచి నేటి కోట్ల టర్నోవర్ వరకు జరిగిన పరిణామాలకు సాక్ష్యం.. ఇదే హుస్నాబాద్ వారసంత. ప్రతీ శుక్రవారమూ జరిగే ఈ అంగడికీ ఏటా ఆదాయమూ పెరుగుతుండగా.. అంతకు మించి 68 సంవత్సరాల చెక్కు చెదరని చరిత్ర దీని సొంతం.

సండే స్పెషల్
Sunday Special



హుస్నాబాద్ పట్టణంలో రాత్రి వరకు కొనసాగుతున్న కూరగాయలు, ఇతర సామగ్రి అంగడి

అంగడి.. జన సందడి

- చిరు వ్యాపారుల చిరునామా హుస్నాబాద్ సంత
- 68 ఏళ్లుగా చెక్కుచెదరని కేంద్రం
- పేదల సూపర్ బజార్.. బంధాలను కలిపే వేదిక
- నాటి ఆదాయం రూ.800... నేడు రూ.1.20 కోట్లు
- ప్రతి శుక్రవారమూ లక్షల్లో టర్నోవర్
- పట్టణ అభివృద్ధిలో సంత ఆదాయమే కీలకం



హుస్నాబాద్ అంగడిలో విక్రయిస్తున్న వివిధ సామగ్రి

హుస్నాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనాల కోసం 1956లో అప్పటి సర్పంచ్ బొప్పరాజు లక్ష్మీకాంతారావు హుస్నాబాద్‌లో ప్రతీ శుక్రవారమూ అంగడిని ప్రారంభించారు. రైతుల పండించిన కూరగాయలు విక్రయించుకోవడం, ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకోవడానికి ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్‌లు లేని కాలంలో అంగడి పరిధిలోని మల్లెచెట్టు చౌరస్తా ఆత్మీయ కలయికలకు వేదిక. ఇక్కడే చాలా రోజుల తర్వాత కలుసుకునే వారి ఆలింగనాలు, వారు పంచుకునే కష్టాసుఖాల కనిపించేవి. బంధువులు, సన్నిహితులతో పాటు ఇతర లావాదేవీల కోసం శుక్రవారం అంగట్లో కలిసి మాట్లాడుకుందాం అనే మాట ఈ ప్రాంతంలో తరచూ వినిపిస్తుంది. తొలుత ఈ అంగడి పట్టణంలోని గాంధీ ప్రాంతంలో జరుగుతుండేది. క్రమక్రమంగా రద్దీ పెరుగుతుండటంతో నాగులమ్మ గుడి పరిసరాలకు మార్చారని చెబుతారు. ఇది ప్రజలకు దూరం కావడంతో మల్లెచెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ గుడి వరకు మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూరగాయల అంగడిని

మిగతా 8వ పేజీలో..

ఏటా పెరుగుతున్న ఆదాయం

ఒకనాడు రూ.800 సంవత్సర ఆదాయంతో ప్రారంభమైన ఈ సంత నేడు రూ.1.20 కోట్ల ఆదాయానికి చేరుకున్నది. హుస్నాబాద్ మున్సిపాలిటీకి 40 శాతం ఆదాయం ఈ అంగడి ద్వారానే వస్తున్నది. ప్రతీయేటా ఈ అంగడిలో క్రయవిక్రయాలు పెరుగుతుండటంతో కాంట్రాక్టర్లు ఈ అంగడిని దక్కించుకునేందుకు వేలం ద్వారా పోటీ పడుతారు. కాంట్రాక్టర్‌కు ప్రతీ వారం రూ.2.50 లక్షలకుపైగా వసూలు అవుతున్నాయి. అయితే ఆదాయం వస్తున్నా అంగడి ప్రాంతం మాత్రం అంతగా అభివృద్ధి జరగడం లేదనే ఆరోపణలున్నాయి. 19 ఏళ్ల క్రితం 2005-06లో రూ.15 లక్షల వరకు ఉన్న ఆదాయం 2013-14 నాటికి రూ.50 లక్షలకు చేరుకున్నది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.80 లక్షల వరకు రాగా, 2024-25 నాటికి రూ.1.20 కోట్ల ఆదాయానికి చేరుకోవడం విశేషం.



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సమీపంలో నిర్వహిస్తున్న పశువులు, పాడి ఆవుల అంగడి

కాంగ్రెస్‌ను ఎదిరించే దమ్ము బీజేపీకి మాత్రమే ఉంది

- అవగాహన లేకుండా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి
- గత ప్రభుత్వంలో 2, 3 శాతం కమీషన్లు.. ఇప్పుడు 10 నుంచి 12 శాతం
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

సిద్దిపేట క్రైం/కొండపాక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను ఎదిరించే దమ్ము బీజేపీకి మాత్రమే ఉందని రాష్ట్ర ప్రజలు నమ్ముతున్నారని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయన కరీంనగర్‌కు వెళ్తూ రాజీవ్ రహదారిలోని ఓ హోటల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు నిరాశతో ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా వారి ఉసురుపోసుకుంటున్నాడని ఆరోపించారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల ఊబిలో నెట్టేసి పోతే, ప్రస్తుత ప్రభుత్వం దానిని కొనసాగిస్తూ ఇంకా కిందిస్థాయికి చేరుస్తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని తాను ఉంటున్న అశోక్‌నగర్‌లో ప్రచారం చేశారని, ఇప్పటికీ ఉద్యోగాల ఊసే లేదని, నిరుద్యోగులపై లాఠీ చార్జి చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ తెలంగాణ భాష అంటూ రాష్ట్రం పరువు తీస్తున్నాడని అన్నారు. గత ప్రభుత్వం 3, 4 శాతం కమీషన్లు తీసుకుంటే ఈ ప్రభుత్వం 10, 12 శాతం కమీషన్ తీసుకుంటుందని విమర్శించారు. 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను, భార్యాభర్తలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ప్రపంచ ఖ్యాతి ఉన్న మోదీ మీద సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేసి గొప్పోడు అనుకుంటున్నాడని, రాహుల్ గాంధీకి పట్టిన గతి సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి బాసంగారి వెంకట్, దినేష్, కొత్తపల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకలో మంత్రి పొన్నం ప్రభాకర్

నెలాఖరులోపు ప్రతీ ఎకరాకు రైతు భరోసా

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలాఖరులోగా ప్రతీ ఎకరాకు రైతు భరోసా నిధులు వస్తాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ ఇచ్చామని, రాబోయే రోజుల్లో అనేక ఉద్యోగాలు ఇచ్చే ప్రభుత్వం తమదేనని తెలిపారు. ఏడాదిలో రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో బీజేపీని నిలదీయలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

హుస్నాబాద్ పట్టణంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు వీరన్ననాయక్, రాంబాబు నాయక్, రాజు నాయక్, భాస్కర్‌నాయక్ సరోజన తదితరులున్నారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని పూజలు చేశారు.

నూతన డైట్ ప్రకారం భోజనాన్ని అందించాలి

- వంట సామగ్రి లేదని సాకుగా చూపితే కఠినచర్యలు
- కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : గురుకుల విద్యార్థులకు నూతన డైట్ ప్రకారం భోజనాన్ని అందించాలని కలెక్టర్ మనూచౌదరి సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాతూర్ రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. 484 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు పలు వంట సామగ్రి కావాలని కోరారు. అన్ని సౌకర్యాలు సమకూరుస్తానని, నాణ్యమైన భోజనం, సదుపాయాలు, విద్యను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వంట సామగ్రి లేదని సాకుగా చూపితే కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. స్టోర్‌రూంలో కాలం చెల్లిన వస్తువులను వాడకూడదని ఆదేశించారు. ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ప్రతి సబ్జెక్టుపై గ్రిప్ ఉండాలని, త్వరలో పరీక్షలు వస్తున్నందున సమయాన్ని వృథా చేయకుండా చదవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ వెంట గజ్వేల్ తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తం

- బిల్లుల చెల్లించకపోవడంతో పట్టించుకోని కాంట్రాక్టర్
- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి భారంగా యూజీడీ మెయింటెనెన్స్

గజ్వేల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎంతో హంగు ఆర్భాటాలతో మొదలుపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు చివరికి అస్తవ్యస్తంగా తయారైంది. రూ.99 కోట్ల వ్యయంతో తలపెట్టిన యూజీడీ పనులు దాదాపుగా పూర్తి కావచ్చినప్పటికీ, చివరి దశ పెండింగ్‌లో ఉండగా, పలు పనులు నిలిచిపోయాయి. అయితే, ఈ యూజీడీ మెయింటెనెన్స్ మున్సిపాలిటీకి తలకు మించిన భారంగా మారుతుంది.

పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్

మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో యూజీడీలో పైపులు పగిలిపోవడం, పైపులలో పలు రకాల వస్తువులు ఇరుక్కుని మ్యాన్‌హోల్స్ నిండిపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇటీవల ఎయిర్‌టెల్ గల్లీలో మ్యాన్‌హోల్స్ నిండిపోవడంతో నీరు బయటకు వచ్చింది. దీంతో మున్సిపాలిటీ పరిధిలో మురుగును క్లియర్ చేసే జెట్టింగ్ మిషన్ ఇతరత్రా వస్తువులు లేకపోవడంతో సిద్దిపేట మున్సిపాలిటీ నుంచి తీసుకువచ్చి చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి రూ.99కోట్లతో చేసిన అంచనాలోనే రెండు జెట్టింగ్ మిషన్లతో పాటు మున్సిపాలిటీ పరిధిలో 133 కిలోమీటర్ల మేర 8,600 ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చే విధంగా పనులను చేపట్టారు. కాగా ఇప్పటికే దాదాపుగా 85శాతం పనులను కాంట్రాక్టర్ పూర్తి చేసినప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పట్టించుకోవడం లేదు.



నిండిన మ్యాన్‌హోల్(ఫైల్)



14వ వార్డులో జెట్టింగ్ మిషన్‌తో యూజీడీని క్లియర్ చేస్తున్న మునిసిపల్ సిబ్బంది(ఫైల్)

మెయింటెనెన్స్ సమస్య

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన యూజీడీ పనులు చేపట్టి ఐదేళ్లు కావస్తున్నది. కొంతమేర పూర్తయి దాదాపుగా రెండేళ్లు కావస్తుండడంతో ఇప్పుడిప్పుడే పలు చోట్ల పైపులు పగిలిపోతున్నాయి. మ్యాన్‌హోల్స్ నిండిపోతున్నాయి. పలు వస్తువులో పైపుల్లో ఇరుక్కుపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై మున్సిపాలిటీ సిబ్బందికి పెద్దగా అవగాహన లేకపోవడం, కావాల్సిన సామగ్రి అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచడం లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులను చెల్లిస్తే యూజీడీని పూర్తి చేసి మున్సిపాలిటీ సిబ్బందికి అవగాహన కల్పించి, కావాల్సిన సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నది. అయితే, యూజీడీలో డైపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, షాంపూ కవర్లు ఇతరత్రా వేయొద్దని పలు మార్లు చెబుతున్నప్పటికీ ఈ మేరకు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ అంశంపై మున్సిపల్ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది. ప్రభుత్వం బిల్లులను చెల్లిస్తే యూజీడీ సాఫీగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.



బుస్సాపూర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లుగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఓ ఇంట్లోని ఫొటో

సర్వం.. సదాశివం

- బుస్సాపూర్ మాజీ సర్పంచ్‌పై అవినీతి ఆరోపణలు
- ఉపాధిహామీ, వీధిలైట్లు, కల్లాల పనుల్లో అక్రమాలు
- విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరుతున్న గ్రామస్థులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) : ఆయన కుటుంబసభ్యుల ఆర్థిక వృద్ధే, గ్రామ అభివృద్ధిగా భావించి ప్రభుత్వం నుంచి మంజూరైన అన్నీ పథకాల నుంచి నిధులను స్వాహా చేశారంటూ మాజీ సర్పంచ్‌పై సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామస్థులు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. గ్రామంలో ఏ అభివృద్ధి పనైనా వారి కుటుంబానికి చెందిన వారికే కాంట్రాక్టులు, పనులు ఇవ్వడం సర్వం సదాశివం అన్నట్లుగా ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు.

గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ కుటుంబసభ్యులు హైదరాబాద్, బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా వారికి ఉపాధిహామీ జాబ్ కార్డు తీసుకోవడంతో పాటు 100 రోజులు పని చేసినట్లు రికార్డులు సృష్టించి డబ్బు పొందినట్లు ఆరోపిస్తున్నారు. ఇలా అతనితో పాటు అదే కుటుంబానికి చెందిన మరో ముగ్గురి పేరున జాబ్ కార్డులు పొందినట్లు చెబుతున్నారు. 2022లో గత ప్రభుత్వం గ్రామంలో వీధిదీపాల కోసం నిధులను మంజూరు చేసింది. వీధి దీపాలకు బదులు ఇంట్లో ఉండే ట్యూబ్‌లైట్ ఫొటోలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి దాదాపూ రూ.2 లక్షలకుపైగా అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. దీంతో పాటు తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లు, కిచెన్ షెడ్లు, శానిటేషన్ నిర్వహణ నిమిత్తం 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదలైన నిధుల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్లాలు, ప్లాంటేషన్‌లో వెలుగుచూస్తున్న అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. గ్రామానికి ఇటీవలే ఏడు కల్లాలు మంజూరు కాగా, ఆ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన ఆరుగురికి లబ్ధి చేకూర్చాడు. ఒక్కొక్కరిపై రూ.85వేలకుపైగా నిధులను కాజేశాడని ఆధారాలతో గ్రామస్థులు వెల్లడించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని కేటాయించిన నిధుల్లోనూ భారీ అవకతవకలు జరిగాయి. లక్ష్యం మేరకు మొక్కలు నాటకపోగా రూ.13 లక్షలకుపైగా నిధులు స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పథకాల నుంచి కాంట్రాక్టుల వరకు అన్నింటా దోచుకున్నారని మండిపడుతున్నారు. మాజీ సర్పంచ్‌తో పాటు ఆయనకు సహకరించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బందిపై విచారణ చేపట్టి తమ గ్రామానికి న్యాయం చేయాలని కలెక్టర్ మనుచౌదరిని గ్రామస్థులు కోరుతున్నారు.

వాహనం కాల్వలో పడి రైతు మృతి


పరశురాములు (ఫైల్)

మిరుదొడ్డి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం కాల్వలో పడి రైతు మృతిచెందిన సంఘటన శనివారం అక్బర్‌పేట-భూంపల్లి రుద్రారం గ్రామశివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పార పరశురాములు(36) శుక్రవారం రాత్రి వ్యవసాయపొలం వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కాల్వలో పడడంతో మృతి చెందాడు. తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా కాల్వలో అతడి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో జారి పడి..

చిన్నశంకరంపేట్ ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి) 15: పొలం కిందపడి యువ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని అంబాజిపేటలో శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చందంపేట గ్రామానికి చెందిన తుడుం రాజు (35) అంబాజిపేట శివారులోని పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు గట్టుపై నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


జగన్నాథ్‌రావు మృతదేహం

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలం పరిధిలోని చిట్కుల్ చాముండేశ్వరి ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 11 గంటలకు ఆలయ సమీపంలోని వరిపొలంలో వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తిగా భావించి వెంటనే అన్నీ పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ నివాసి పతంగా సంతోష్ తన తండ్రి పతంగే జగన్నాథ్‌రావు(60) అదృశ్యంపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండగా, ఇక్కడి మృతి చెందిన వ్యక్తి వివరాలను తెలిశాయి. దీంతో ఘటానా స్థలానికి చేరుకున్న సంతోష్ మృతుడు అతడి తండ్రిగా గుర్తించాడు. తన తండ్రి ఈ నెల 12న సాయంత్రం స్కూటీపై బయటికెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే క్రమంలో ఈ విషయం తెలిసిందన్నారు. 3 నెలల క్రితం తన తల్లి మృతిచెందగా, ఆమె అస్థికలు మంజీరా నదిలో కలిపామన్నారు. అందులో భాగంగానే మంజీరా నది ఒడ్డున గల చాముండేశ్వరి ఆలయం సమీపంలో తన తండ్రి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు. సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడిని హత్య చేసిన అన్నకు రిమాండ్

మునిపల్లి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : సొంత తమ్ముడిని హత్య చేసిన అన్నను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చీలపల్లి గ్రామానికి శివయ్యను శుక్రవారం సాయంత్రం తన అన్న యాదయ్య హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మండలంలోని బుదేరా చౌరస్తా వద్ద యాదయ్య పోలీసులను చూసి పారిపోతుండగా వెంటపడి పట్టుకున్నారు. విచారణలో శివయ్యను బండరాయితో కొట్టి చంపినట్లు ఒప్పుకోవడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు. 12 గంటల్లోనే కేసును ఛేదించిన ఎస్‌ఐ రాజేష్‌ని, సిబ్బంది ఎండీ హనీఫ్, పాండు, తుకారాంలను కొండాపూర్ సీఐ వెంకటేశ్ అభినందించారు.

అక్రమంగా నిల్వ చేసిన 196 సిలిండర్లు స్వాధీనం


సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

జహీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మొగుడంపల్లిలో ఓ గ్యాస్ డీలర్ దుకాణం పక్కన ఉన్న షెటర్లలో కొందరు భారత్, ఇండియన్ కమర్షియల్ సిలిండర్లు అక్రమంగా నిల్వచేసి వ్యాపారస్థులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ అధికారులు శనివారం ఆయా దుకాణాలపై దాడులు నిర్వహించి మొత్తం 196 సిలిండర్లను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై అధికారులు స్వరూప, షాజొద్దీన్, బస్వరాజ్, ఆర్ఐ. సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్సు దోచే.. బెల్లం చాయ్

- ఔషధ గుణాలు ఉన్న బెల్లం-టీ కోసం జనం క్యూ
- బెల్లం ఛాయ్ తాగేందుకు టీ ప్రియుల ఆసక్తి
- సంగారెడ్డి బైపాస్ రోడ్డులో లభ్యం





సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉషోదయంతో పాటు లేచిన ప్రజలకు వేడి వేడి టీ గొంతులో పడితేనే ఆ రోజు ప్రారంభం కాదు. టీ(చాయ్)ని ఆరో ప్రాణంగా భావించే వారు కోకొల్లలు. నలుగురు మిత్రులను ఏకం చేసే సత్తా 'టీ'కి ఉంది. ఇందులో ఉన్నో రకాలు ప్రజల్లోకి చేరి పసందైన రుచితో అలరిస్తున్నాయి. 'టీ' లందు బెల్లం టీ రుచే వేరయా' అన్నట్టుగా ఇప్పుడు సంగారెడ్డి వాసులను కొత్త రకం బెల్లం టీ విశేషంగా ఆకట్టుకుంటున్నది. భిన్నమైన రుచితో గుమగుమలాడే వేడి వేడి బెల్లం చాయ్‌ని తాగేందుకు పట్టణ వాసులు ఉత్సాహం చూపుతున్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ నుంచి తీసుకొచ్చిన బెల్లంతో తయారుచేసే టీకి మంచి గిరాకీ లభిస్తున్నది. ఇందులో ఔషధ గుణాలు కూడా మెండుగానే ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు. మధుమేహం, ఇతర జబ్బులు ఉన్న వారు చక్కెర వినియోగం తగ్గించుకోవాలని డాక్టర్ల హెచ్చరికలు ఉండడంతో ప్రత్యామ్నాయంగా బెల్లం టీని ఎంపిక చేసుకుంటున్నారు. దీనివల్ల శ్వాస వ్యవస్థ శుద్ధి, వ్యాధి నిరోధకత, శరీరంలోని వ్యర్థాల తొలగింపు, జీర్ణవ్యవస్థకు మేలు చేసి మనస్సును ఉల్లాసభరితంగా ప్రశాంతంగా ఉంచడంతో పాటు ఉద్యోగం, పని, ఆలోచనల ఒత్తిడితో అలసిపోయిన శరీరానికి ఎన్నో సుగుణాలు ఉన్న బెల్లం టీ స్వాంతన నిస్తుందని ఆయుర్వేద గ్రంథాలు, వైద్యులు సూచిస్తున్నారు. చక్కటి ఆరోగ్యాన్ని పంచే ఈ బెల్లం చాయ్‌ని సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఇద్దరు స్నేహితులు కనకదుర్గా టీ స్టాల్ పేరిట హోటల్‌ను ఏర్పాటు చేసి టీ-ప్రియులకు పరిచయం చేసి అందరిని ఆకట్టుకుంటున్నారు. సంగారెడ్డితో పాటు సమీప ప్రాంతాల ప్రజలు, జాతీయ రహదారి వెంట ప్రయాణిస్తున్న ప్రయాణికులు బెల్లం-టీ తాగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు సంగారెడ్డి వైపు వస్తే మీరు కూడా బెల్లం చాయ్ రుచి చూడండి.

డంపుయార్డు ముట్టడికి యత్నం

- అడ్డుకున్న పోలీసులు
- భారీ ఆటో ర్యాలీ తీసిన మహిళలు, జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 15 (ఆంధ్యజ్యోతి) : ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును మానుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలు మరింత ఉధృతంగా సాగుతున్నాఇ. శనివారం జేఏసీ కన్వీనర్ జైపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి అధ్వర్యంలో గుమ్మడిదలలో ఫైనార్టీ సోదరులు రిలే నిరహార దీక్ష చేపట్టగా, నల్లవల్లి, కొత్తపల్లిలో అర్ధనగ్న ప్రదర్శనలు, ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం, మహిళా సంఘాల నేతృత్వంలో మహిళలు డంపుయార్డు ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే నిరసనలను మరింత తీవ్రతరం చేస్తామని రైతు జేఏసీ నేతలు హెచ్చరించారు.

డంపుయార్డు ఏర్పాటును రద్దు చేయండి : సీపీఎం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు హానీ కలిగించే డంపుయార్డు ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పర్యావరణానికి ముప్పు కలిగించే డంపింగ్ యార్డు నిర్మాణం సరైందికాదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు మాణిక్యం, రాజయ్య, రాంచందర్, నర్సింలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆటోలతో నిరసన తెలుపుతున్న మహిళలు, రైతులు

మత్తు చాక్లెట్లపై అప్రమత్తంగా ఉండాలి

- యాంటీ నార్కోటిక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ పుష్పన్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ పుష్పన్‌కుమార్

కౌడిపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి)15 : కొంతమంది విద్యార్థులకు చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తూ మత్తుకు బానిసలుగా మారుస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని యాంటి నార్కోటిక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ పుష్పన్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తునికి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ హరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదర్థాలు విక్రయిస్తే వెంటనే 1908కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌పై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

- తృటిలో తప్పిన ప్రమాదం



కంది, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కంది శివారులో ఓ పెట్రోల్ ట్యాంకర్ బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం మహరాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ కంది శివారులో ముందున్న లారీని ఓవర్‌టెక్ చేయడానికి యత్నించాడు. ఈ క్రమంలో ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న అండర్‌డ్రైనేజీలో బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆ ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ కాకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ సిబ్బంది ట్యాంకర్‌లోని పెట్రోల్‌ను పైపులద్వారా వేరే ట్యాంకర్‌లోకి సురక్షింతగా నింపారు.

కోర్టు ఆదేశాలతో ప్లాట్ల వద్దకు ఓనర్స్

- పోలీసులను బందోబస్తు కోరిన మున్సిపల్ అధికారులు
- వచ్చిన వెంటనే వెనక్కి పంపిన కమిషనర్


ప్లాట్ల వద్ద గుమిగూడిన ప్లాట్ ఓనర్స్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు గ్రామంలో నాలుగు దశాబ్దాలుగా వివాదాలతో కూడిన ప్లాట్ల అంశం మరో మారు తెరపైకి వచ్చింది. కొల్లూరులోని సర్వే నంబరు 176లోని ప్లాట్లు తమవంటూ కొందరు వ్యక్తులు కోర్టు ఆదేశాలతో శనివారం ప్లాట్ల వద్దకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ ప్లాట్ ఓనర్స్ పెద్ద సంఖ్యలో ఉండటంతో పోలీసులు బందోబస్తు కల్పించాలంటూ కొల్లూరు పోలీసులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ రవిందర్ ఆదేశాలతో ఎస్ఐ రమేశ్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతలోనే ఏం జరిగిందో, మతలబు ఏంటో తెలియదు కానీ కమిషనర్ సంగారెడ్డి ఇప్పుడు బందోబస్తు అవసరం లేదని తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన తరువాత మరోమారు మిమ్మల్ని పిలుస్తానంటూ చెప్పడంతో పోలీసులు వెనక్కి తిరిగారు. కమిషనర్, అధికారులతో మాట్లాడిన కొనుగోలుదారులు కోర్టు ధ్రువపత్రాలను చూపి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

విద్యార్థిదశ నుంచే నైపుణ్యం పెంపొందించుకోవాలి

- అగ్రికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సీహెచ్ విద్యాసాగర్

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. సిహెచ్. విద్యాసాగర్ అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ముడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడలు శనివారం అట్టహాసంగా ముగిసాయి. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్. విద్యాసాగర్ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని గెలుపు దిశగా పయనించాలని కోరారు. చదువు, ఉన్నత ఉద్యోగం మాత్రమే జీవితానికి సరిపోదని, అదనపు రంగాల్లోనూ ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. అనంతరం అతిదులందరికీ ప్రిన్సిపాల్ డా. శ్రీదేవి సన్మానించి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పలు పాలిటెక్నిక్ కళాశాలల ప్రొఫెసర్లు, క్రీడాకారులు, తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, వ్యవసాయ పరిశోదన, విస్తరణ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు



విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్న అధికారులు

మృతిచెందిన సీఆర్పీల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన

- వరంగల్‌లో సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్
- అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలింపు


తూప్రాన్ ఆసుపత్రి వద్ద సీఆర్పీల ఆందోళన

తూప్రాన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్పీలు రమేశ్‌నాయక్, ఎర్ర శ్రీనివాస్ కుటుంబాలకు న్యాయం చేయాలని సీఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతదేహాలను స్వగ్రామాలైన గొల్లపల్లి జెత్రంతండా, చందాయిపేటకు తరలించకుండా తూప్రాన్ ఆస్పత్రి వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆనంతరం సీఆర్పీల మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు. ఈ సందర్భంగా సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సహదేవ్ మాట్లాడుతూ మృతుల కుటుంబీకులకు రూ. 30లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఆర్పీలకు ఉద్యోగ భద్రతపై వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.

ఆటో డ్రైవర్ ఇంటి ఎదుట మృతదేహంతో నిరసన

చేగుంట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పోస్టుమార్టం అనంతరం చందాయపేటకు తరలించిన సీఆర్పీ శ్రీనివాస్ మృతదేహాన్ని శివునూరు గ్రామానికి తీసుకెళ్లి ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ స్వామి ఇంటిముందు ఉంచి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు తీసేది లేదని మొండికేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పి ఆందోళనవిరమింప జేశారు. సుమారు 6 గంటల మృతదేహాన్ని ఇంటిముందు ఉంచారు. కాగా, మృతి చెందిన సీఆర్పీల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ పేర్కొన్నారు. శనివారం సీఆర్పీల మృతదేహాలకు నివాళులర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇదిలా ఉండగా డీఈవో ఆదేశాల మేరకు చేగుంట ఎంఈవో నీరజ సీఆర్పీల అంత్యక్రియల కోసం తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందజేశారు.



సస్య రక్షణతో అధిక దిగుబడులు

- వరి సాగులో మెళకువలు
- వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు మీకోసం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరిసాగులో సమగ్ర సస్య రక్షణ విధానం ద్వారా రైతులు మంచిదిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మగాని వరిలో ఉదా మొదలైన ఏక గడ్డిజాతి మొక్కలు, వరిలో కాండం తొలుచు పురుగు, లేత పసుపు పచ్చని పురుగులు అంకురాన్ని ఆశించడం, సుడిదోమ, అగ్గి తెగలు వంటి లక్షణాలు ఈ సీజన్ లో కనిపిస్తూ ఉంటాయి. వీటిని నాశనం చేయడంలో పలు రకాల పద్ధతులు పాటిస్తే రైతులు మంచి దిగుబడి ఉంటుందని చెబుతున్నారు.

కలుపు యాజమాన్యం

మాగాణి వరిలో ఊద మొదలైన ఏక వార్షక గడ్డిజాతి మొక్కలు ఉన్నప్పుడు ప్రిటిలాక్లోర్ 50శాతం 500 మి.లీ. లేదా బెంథియోకార్బ్ 50శాతం 1.5 నుండి 2.0 మి.లీ లలో ఏదో ఒక దానిని ఎకరాకు 25 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుండి 5 రోజులలో పలుచగా నీరు పెట్టి సమానంగా చల్లాలి.

వరిలో కాండం తొలుచు పురుగు

రెక్కల పురుగు ఆకుల కింది భాగంలో గుడ్లు పెట్టి కాండాన్ని తొలుస్తుంది. తద్వారా వరిలో తెల్లకంకులు ఏర్పడం జరుగుతుంది లేత దశలో ఈ పురుగు వల్ల దుబ్బులోని కంకులు దెబ్బతింటాయి. ఇందుకు గాను రైతులు నాటువేసిన 15-20 రోజులలో 8 కిలోల కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలని చల్లుకోవాలి.

ఉల్లికోడు

లేత పసుపుపచ్చని పురుగులు అంకురాన్ని ఆశించడం వల్ల ఉల్లికాడ లాంటి పొడవాటి గొట్టాలు పొలంలో కనిపిస్తాయి ఇందుకుగాను రైతులు విత్తినానంతరం పది కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా ఫోరెట్ 5కిలోలు నాటిన 10 రోజుల్లో చల్లుకోవాలి.

సుడిదోమ

గోధుమ రంగులో గాని లేదా బూడిద రంగులో గాని ఉండే పురుగులు మొక్క మొదళ్ల వద్ద రసాన్ని పీల్చి వేయడం వల్ల కాండం బలహీనపడిపోయి సుడులుగా ఎండిపోతాయి. ఇందుకు గాను రైతులు కుదురుకు 15-20 పురుగులను గమనించినట్లయితే అసిపేట్ 1.5గ్రాములు లేదా ఎథ్ పెన్ ప్రాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లుకోవాలి. లేదా 120 గ్రాముల పైమెట్రిజిన్‌ను 150 లీటర్ల నీటిలో కలిపి చల్లుకోవాలి.

తెగుళ్ల యాజమాన్యం

మన ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను బట్టి యాసంగిలో చిరుపొట్ట దశలో అగ్గితెగులు లక్షణాలను గమనిస్తూ వున్నాము. ఆకుల పై ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగుగల నూలుకండె ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు ఎండిపోయి తగులబడినట్లు కనిపిస్తాయి.

పోషక యాజమాన్యం

యాసంగి వరిలో చలి తీవ్రత అధికంగా ఉండటం వల్ల పైరు పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకోలేదు. ప్రత్యేకించి జింక్ లోప లక్షణాలు అధికంగా అగుపడుతాయి ఇందుకు గాను రైతులు 3పంటలకు ఒకసారి 20కిలోల జింక్ సల్ఫేట్ ను ఆఖరి దుక్కిలో చల్లుకోవాలి. యాసంగిలో పశువుల పేడ లేదా కోళ్ల, మేకల, గొర్రెల ఎరువును పొలంలో వాడుకుంటూ ఉండాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

యాసంగి వరి సాగులో సస్య రక్షణ చర్యలపై ఇప్పటికే మండలంలో ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా పంటల పైన ఏమైనా సందేహాలు ఉంటే రైతులు నేరుగా మండల వ్యవసాయ కార్యాలయంలో కానీ, ఆ శాఖ అధికారులు కానీ సంప్రదించవచ్చు.

-శ్రీనాథ్,
మండల వ్యవసాయ శాఖ అధికారి

ఏటీఎంలో రూ.2.50లక్షలు చోరీ

జహీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భవానిమందిరం వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం భవానిమందిర్ వద్ద గల ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.2,50లక్షలు ఎత్తుకెళ్లారు. శనివారం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఎటీఎంను కటర్‌లతో కట్‌చేసి నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. క్లూస్‌టీంని రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జహీరాబాద్‌కు ఆనుకుని ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో ఇటీవల జరిగిన ఏటీఎం దోపిడి ఘటన నుంచి తేరుకోకముందే జహీరాబాద్ పట్టణంలోని ఏటీఎంలో దొంగతనం జరగడం చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థి చేతులు నరికిన దుండగులను శిక్షించాలి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని మానామధురైకి చెందిన దళిత విద్యార్థి చేతులు నరికిన దుండగులను కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. దుండగుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా శనివారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో గజ్వేల్ అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, డీబీఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు చంద్రం, దళిత నాయకులు పాల్గొన్నారు.

నేడు పద్మశాలీ సమాజం సమావేశం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా పద్మశాలీ సమాజం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని మార్కండేయ ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి మామిడాల మోహన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12న జరిగిన సమావేశంలో ప్రకటించిన నియమావళిపై కొందరు సవరణలు సూచించారని, అందుకే మరోసారి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జాగ్రత్తలు పాటిస్తే అక్షరాలను అందంగా రాయవచ్చు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రతి ఒక్కరూ అక్షరాలను అందంగా, గుండ్రంగా రాయవచ్చునని ప్రముఖ చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని మాచాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం చేతిరాతలో నైపుణ్యాలు, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో అందంగా రాసే విధానం గూర్చి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేతిరాతను అందంగా రాసేవారికి జ్ఞాపక శక్తి మెండుగా ఉంటుందన్నారు. దీంతో చదువులో చక్కగా రాణిస్తారని ఆయన తెలిపారు. అనంతరం ఎజాజ్ అహ్మద్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

అక్రమ కేసులు పెట్టడం సరికాదు

సిద్దిపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయాలని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులను పెట్టించడం సరైంది కాదని మిరుదొడ్డి మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు హైమ్మద్ మండిపడ్డారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులను నమోదు చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఆరుగ్యారంటీల్లో ఒక్క గ్యారంటీని కూడా అమలుచేయలేదని, నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న పాపానికి అక్రమ కేసులను పెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్‌వై యాదవ్, దుర్గేష్‌యాదవ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నిరుపేద వధువుకు ఆర్థిక సహాయం

సిద్దిపేట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మిరుదొడ్డి గ్రామానికి చెందిన నిరుపేద వధువు అంజలి కుటుంబానికి శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.



సిద్దిపేటలో గిరిజన మహిళల సంప్రదాయ నృత్యం



వర్గల్‌లో సేవాలాల్ చిత్రపటంతో తండా వాసుల ర్యాలీ



దౌల్తాబాద్ జూనియర్ కళాశాలలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి





కోహెడలో ర్యాలీ అనంతరం సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు, దుబ్బాకలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న బంజారాలు

సిద్దిపేటకల్చరల్/వర్గల్/దుబ్బాక/కోహెడ/గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్దిపేటలో సేవాలాల్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో సద్గురు సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభోగ్‌బండారు కార్యక్రమాన్ని స్థానిక ఎస్టీ హాస్టల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ తహసీల్దార్ సలీం హజరై మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. శ్రీనాథ్, డాక్టర్ రవినాథ్ ముదావత్, బిక్షపతి నాయక్, రమేష్ నాయక్, నాగు నాయక్, డా. చందర్ నాయక్, హరిబాబు, వీర నాయక్, ప్రకాష్‌నాయక్ పాల్గొన్నారు. వర్గల్ మండలం నగరం తండావాసుల ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం వర్గల్ మండల కేంద్రంలో స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దుబ్బాక మండలం శిలాజీనగర్ గ్రామానికి చెందిన తండావాసులు దుబ్బాక బస్టాండ్ వద్ద సద్గురు సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని ఆటపాటలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ శ్రీనివాస్, వెంకటగిరి తండా, టేకులతండా బంజారాలు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ కళాశాల అధ్యాపకులతో కలిసి సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కోహెడమండల కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి గిరిజనులు తరలివచ్చి కోహెడలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదాంబమాత, సేవాలాల్ మహారాజ్, రామారావు మహరాజ్ కు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. సంప్రదాయక బంజారా పాటలతో మహిళలు నృత్యాలు చేశారు. గజ్వేల్ మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్‌లో బంజారాలు నిర్వహించిన సేవాలాల్ జయంతి కార్యక్రమానికి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంజారాలలో చైతన్యాన్ని నింపిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మహాత్మా జ్యోతిబాఫూలే మహిళా గురుకులంలో ఐ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

వర్గల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చక్కగా చదువుకుని, అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలని తెలంగాణ మహాత్మా జ్యోతి బాఫూలే సంస్థల అధికారి సైదులు పేర్కొన్నారు. శనివారం వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాఫూలే మహిళాడిగ్రీ కళాశాలలో పూర్(పీపుల్ ఫర్ అర్బన్ రూరల్ ఎడ్యుకేషన్) స్వచ్ఛంద సంస్థ సీఈవో తల్లూరి శైలతో కలిసి ఐల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ స్వచ్ఛంద సంస్థ వారు క్లరనెట్ కంపెనీకి చెందిన 20 ల్యాప్‌టాప్‌లను కళాశాలకు అందించారు.

కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్సీవో గౌతమ్‌కుమార్, కళాశాల ప్రాచార్యులు గడ్డం భాస్కర్‌రావు, కాగ్నిజెంట్ సీనియర్ మేనేజర్ శివ బవనరి, శ్రీబాల ప్రసాద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఉసురు పోసుకుంటున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప

చేర్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను అందించకుండా పంట పొలాలను ఎండ బెడుతూ ప్రభుత్వం చేర్యాల ప్రాంత రైతాంగం ఉసురుపోసుకుంటున్నదని కొమురవెల్లి మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల, జనగామ ప్రాంత రైతుల ప్రయోజనం కోసం గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలంటూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని, అధికారులను కోరినా చలనం లేకపోవడం తగదన్నారు. వేసవి దృష్ట్యా పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌నుండి వెంటనే సాగునీరందించడంతో పాటు ఈప్రాంత చెరువులు నింపాలని, లేదా ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు తలారి కిషన్, ఏర్పుల మహేశ్, గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులు, కొండా శ్రీధర్, పోతుగంటి కొమురవెల్లి, దాసరి మచ్చేందర్, దాసరి బాబు, గుజ్జ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సహకార' సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అహ్మదీపూర్‌లో మాట్లాడుతున్న మేనేజర్ సౌభాగ్య

గజ్వేల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ డీసీసీ బ్యాంకు మేనేజర్ సౌభాగ్య కోరారు. మండలంలోని అహ్మదీపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిపాజిట్లపై అన్ని బ్యాంకులకంటే 0.50 శాతం అధిక వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 0.50శాతం అధిక వడ్డీ చెల్లిస్తున్నట్టు చెప్పారు. డిపాజిట్లపై ఇన్సూరెన్స్ కవరేజీ ఉందని, బ్యాంకులో పొదుపు ఖాతాలు లాకర్ సౌకర్యం, ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ సౌకర్యాలు ఉన్నాయన్నారు. బ్యాంకు ద్వారా హౌసింగ్ లోన్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు. సాగుభూమి పట్టా రెండు ఎకరాలకు పైబడి ఉన్న రైతులకు రూ.50లక్షలు, గ్రామీణ ప్రాంతాల రైతులకు రూ.20లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. రైతునేస్తం, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, గొర్రెల పెంపకం, ట్రాక్టర్లు, హార్వేస్టర్, బోరు మెటార్స్, ఎడ్యుకేషన్ లోన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వారితో బ్యాంకు అధికారులు సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఫాక్స్ డైరెక్టర్లు, ఫీల్డ్ ఆఫీసర్స్ రాజశేఖర్, శ్రీకాంత్, పాక్స్ సీఈవో బాలయ్య, సిబ్బంది చంద్రారెడ్డి, నారాయణ, రైతులు ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హిందూవాహిని నాయకులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 19న ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో నిర్వహించనున్న బైక్ ర్యాలీ, భారీ బహిరంగ సభకు ప్రతీ హిందువు హాజరై విజయవంతం చేయాలని హిందూవాహిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కస్తూరి భూమిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చిన్నకోడూరులో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు ఐలయ్య హిందువాహిని నాయకులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులు నిబంధనలు పాటించాలి

మద్దూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని పంచాయతీ సెక్రటరీ అశోక్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండలంలోని ఇందిరమ్మ పైలెట్ గ్రామమైన ధర్మారం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లకు సర్వే నిర్వహించినప్పుడు ఎక్కడైతే ఇల్లు కోసం ఫొటో దిగారో అదే స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. మరోచోట నిర్మాణం చేపడితే, ఫొటో క్యాప్చర్ చేసినా బిల్లుల చెల్లింపు జరగదన్నారు. నాలుగు విడుతల్లో బిల్లుల చెల్లింపులుంటాయని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చేర్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోల్ల భాస్కర్(60) అనారోగ్యంతో మృతిచెందగా, శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ ఫోన్‌లా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, దాసరి కళావతి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్య, ఇతర బీఆర్ఎస్ నాయకులు తదితరులు నివాళులర్పించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

గజ్వేల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మిషన్ భగీరథ గజ్వేల్ ఈఈ వి. శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మత్తుల్లో భాగంగా ఈ నెల 17న ఉదయం 6గంటల నుంచి 18వ తేదీ ఉదయం 6గంటల వరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో 17న సాయంత్రం, 18న ఉదయం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

రామయ్య పంతులు సేవలు మరువలేనివి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ గాంధీ నరసింహ రామయ్య పంతులు సేవలు మరువలేనివని ఏఎన్ఆర్ పీపుల్స్ ట్రస్ట్ చైర్మన్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ పేర్కొన్నారు. శనివారం నరసింహరామయ్య పంతులు వర్ధంతి సందర్భంగా జగదేవ్‌పూర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శ్రీధర్‌శర్మ, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం

గజ్వేల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏఐసీసీ పరిశీలకులుగా మీనాక్షి నటరాజన్ నాయకత్వం వహించడం కాంగ్రెస్ శ్రేణుల అదృష్టమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని తన నివాసంలో ఆమె ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆమె జాతీయస్థాయికి ఎదిగారన్నారు. రాష్ట్రంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో కార్యక్రమంలో ఆమెతో కలిసి తాను పాదయాత్ర చేశానని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంతో, మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు జంగం రమేశ్‌గౌడ్, అజ్గర్, గణేశ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతకు ఏఎంసీ చైర్మన్ పరామర్శ

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంత్రి కృష్ణమూర్తి తల్లి బాలమణి అనారోగ్యంతో మృతి చెందింది. ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి శనివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సాయమందించి ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరుకు చెందిన పురుషోత్తం భాగ్యలక్ష్మి ఈ నెల 13న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన భాగ్యలక్ష్మి తల్లి వజ్రవ్వ కూతురుకు ఫోన్ చేసి సమాచారమిచ్చింది. భాగ్యలక్ష్మి ఇంటికి చేరుకుని చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపల బీరువా డోర్‌లు తెరచి ఉండి అందులోని దుస్తులు, వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో పరిశీలించగా 2 బంగారపు ఉంగరాలు, కెంపుల్స్ హారం మొత్తం 12.5 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇసుక తరలించవద్దని రైతుల ఆందోళన



రుద్రాయపల్లి పల్లెవాగులో నిరసన తెలుపుతున్న రైతులు

చేర్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి) : సీసీరోడ్ల నిర్మాణం కోసం చేర్యాల మండలం ఆకునూరు శివారు రుద్రాయపల్లి పల్లెవాగు నుంచి ఇసుక తరలించడాన్ని విరమించుకోవాలని కోరుతూ ఆయకట్టు రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కాశీగుడిశెలు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం పేరిట వాగులో నుంచి ఇసుక తరలింపునకు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. వేసవికాలంతో భూగర్భ జలాల నీటిమట్టం అడుగంటాయని, ఇసుక తరలింపుతో మరింత ఇబ్బందులు ఎదురై నీరందక పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణానికి ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు యాదయ్య, కనకయ్య, సత్తయ్య, శ్రీను, చంద్రయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈవో

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కుకునూరుపల్లి మండల ఎంఈవో బచ్చలి సత్తయ్య తల్లిదండ్రులను కోరారు. శనివారం తిప్పారం ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, సర్కారు బడులు వసతులు, బోధనలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పనిచేస్తున్నాయని తెలిపారు. పదోతరగతి విద్యార్థుల సన్నద్ధతపై ఆయన పలు సూచనలు చేశారు. తల్లిదండ్రుల సమక్షంలోనే విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌దే



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొక్కను నాటి నీరు పోస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, నాయకులు దేవీ రవిందర్, శ్రీనివాస్, నవాజ్‌మీరా, బెండే మధు, అత్తెల్లి శ్రీనివాస్, బొల్లారం ఎల్లయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రం, దయాకర్‌రెడ్డి, మల్లేశం, గోపాల్‌రెడ్డి, ఉమర్, అహ్మద్, ఆర్‌కే, బొగ్గుల చందు, రాజు తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ తదితరులు

చేర్యాల, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించడంపట్ల చేర్యాల పీఏసీఎస్ పాలకవర్గం హర్షం వ్యక్తంచేస్తూ శనివారం స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగానికి ఒరగబెట్టిందేమీలేదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొమ్ము రవి, బొడిగం జ్యోతి, తాళ్లపల్లి నాయకులు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులకు యువకుల చేయూత

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మృతితో అనాథలైన ఇద్దరు చిన్నారుల అండగా మేమున్నామంటూ మండలంలోని ఇటిక్యాల గ్రామ ఎస్సీ కాలనీ యువకులు ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన యేసు, సౌమ్య ఏడు నెలల క్రితం అప్పులు, ఆర్థిక సమస్యలతో బలవన్మరణం చెందారు. దీంతో ఇద్దరు పిల్లలు శివాన్స్, శ్రేయన్స్ అనాథలుగా మారారు. ప్రస్తుతం పెద్దనాన్న రాజు వారి బాగోగులు చూసుకుంటున్నారు. శనివారం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ చిట్టి యూత్ సభ్యులు తలా కొంత జమచేసి రూ. 45 వేల ఆర్థిక సహాయం పిల్లలకు అందించారు. చేయూతనందించిన యువకులను గ్రామస్థులు అభినందించారు.

వీరన్నపేట జడ్పీఎస్ఎస్ స్థల పరిరక్షణకు పాటుపడతాం

చేర్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తమను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా చేర్యాల మండలం వీరన్నపేట జడ్పీఎస్ఎస్ స్థలం కబ్జాను అడ్డుకుంటామని మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి స్పష్టం చేశారు. చేర్యాల మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల చదువుకోసం గ్రామస్థులందరి విరాళాలతో జడ్పీఎస్ఎస్ కోసం రెండు దశాబ్దాలక్రితం రెండెకరాల ఐదు గుంటల భూమి కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆ స్థలంలో పాఠశాల భవనంతోపాటు అవసరమైన సౌకర్యాలు, ఇతర ప్రజోపయోగ నిర్మాణాలు చేపట్టినట్టు వివరించారు. యితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఒక ఎకరం 26 గుంటల స్థలం పాఠశాల పేరిట అమలులో ఉన్నప్పటికీ మిగిలిన 19 గుంటల భూమి ధరణి కారణంగా పట్టాదారుల పేరిట వస్తున్నట్టు తెలిపారు. పట్టాదారుల కుమారులు అక్రమంగా పట్టాకు యత్నించడాన్ని అడ్డుకుంటున్నామన్నారు. ఈ కారణంగా తనతో పాటు ఆరుట్ల పాపయ్య, కొండాపురం మధు, పైసా లింగం, సూర్న బీరమల్లుపై అసత్య ప్రచారం చేస్తూ కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

అంగడి.. జన సందడి

(5వ పేజీ తరువాయి)

రామవరం మెయిన్ రోడ్డుతో పాటు పోలీస్ స్టేషన్ రహదారి పక్కన, పశువులు, మేకల అంగడిని ఎల్లమ్మ చెరువు దగ్గర సమ్మక్క గద్దెల వద్ద నిర్వహిస్తున్నారు.

నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి..

ఈ అంగడికి నాలుగు ఉమ్మడి జిల్లాల ప్రజలు వస్తారు. నల్లగొండలోని సూర్యాపేట, నకిరేకల్, ఆలేరు, వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హసన్‌పర్తి, మహబూబాద్, జనగామ, నర్మెట, తరిగొప్పుల, సిద్దిపేటతో పాటు జిల్లాలోని చేర్యాల, మద్దూర్, కొండాపూర్, బెక్కల్, నంగునూరు చిన్నకోడూర్, దుద్దెడ, బెజ్జంకి, కోహెడ, కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, తిమ్మాపూర్, చిగురుమామిడి, ఇల్లంతకుంట నుంచి పెద్దఎత్తున వివిధ వ్యాపారాల నిమిత్తం వస్తారు. ఈ రోజు హుస్నాబాద్ పట్టణంలోని రోడ్లన్నీ జనంతో కిటకిటలాడుతాయి.

వస్తు మార్పిడి నుంచి ..

ఈ అంగడి ప్రారంభంలో మొదటగా వస్తు మార్పిడి జరిగేది. ఒకరు పండించిన వస్తువును తీసుకుని, వారు తెచ్చిన వస్తువు ఇవ్వడం జరిగేదంటారు. కాలక్రమేణా డబ్బుతో క్రయవిక్రయాలు మొదలయ్యాయి. ఇది దినదినాభివృద్ధి చెందుతూ అన్ని రకాల వస్తువులు, దుస్తులు, కూరగాయలు.. అన్ని రకాలు లభ్యమవుతున్నాయి. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో అంగడే కాదు వ్యాపార సంస్థలన్నీ కళకళలాడుతాయి. వారం రోజులు కష్టపడి పైసాపైసా కూడబెట్టుకున్న వారు భార్య పిల్లలతో కలిసి వచ్చి తమకు ఇష్టమైనవి తింటారు. వారం రోజులకు సరిపడా సామగ్రిని కొనుక్కుంటారు. ఈ రోజు హోటళ్లు, ఇతర వ్యాపారాలు వీరితో కిటకిటలాడుతాయి.

పశువులు, గొర్ల విక్రయాలకు కేరాఫ్

ఉత్తర తెలంగాణలోనే పశువుల అంగడంటేనే హుస్నాబాద్ పెట్టింది పేరు. శుక్రవారం పశువుల (జెర్సీ ఆవులు, ఎడ్లు, గేదేలు) విక్రయాలు పెద్దఎత్తున సాగుతాయి. ఈ ప్రాంతంలో కరువు ఎక్కువగా ఉండడంతో పాడి ఆవుల కొనుగోల్లు ఎక్కువగా జరుగుతాయి. ఎక్కడెక్కడి నుంచో లారీల ద్వారా ఆవులను తీసుకువచ్చి విక్రయిస్తారు. ఒక్కో పాడి ఆవు, గేదేకు రూ.80 వేల నుంచి లక్ష వరకు ఉంటుంది. ప్రతీ వారం వెయ్యి పశువుల క్రయవిక్రయాలు జరుగుతాయి. వివాహ, ఇతరత్రా ఫంక్షన్‌ల కోసం ఇక్కడ గొర్రెలు, మేకల విక్రయాలు పెద్దఎత్తున సాగుతాయి. హైదరాబాద్ నుంచి వ్యాపారులు వచ్చి గొర్రెలు, మేకలను కొనుగోలు చేసి లారీల్లో తీసుకెళతారు.

మా తాతల నుంచి ఇక్కడ వ్యాపారం



మా తాతల నుంచి ఈ అంగడికి వస్తున్నరు. గొంగళ్ల వ్యాపారం చేస్తున్నం. అప్పటికీ ఇప్పటికీ అంగడి బాగా పెరిగింది. ఈ అంగడే చాలా పెద్దది. అప్పుడు గొంగళ్లకు వ్యాపారం బాగా జరిగేది. ఇప్పుడు అంత లేదు. ఈ అంగడిలో ప్రతీ వస్తువు దొరుకతది. చుట్టూ వంద గ్రామాల ప్రజలు ఇక్కడికి వస్తారు.

- అగిరి చిన్న,
గొంగళ్ల వ్యాపారి, సిద్దిపేట